ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 5 ఫిబ్రవరి 2025



వెంటాడిన 'విధి' ..

● విధులకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
● మహిళా ఎస్ఐ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతి

వివరాలు 6లో



రోదిస్తున్న ఎస్ఐ కుటుంబ సభ్యులు

గల్ఫ్ బాధితులకు ఆపన్నహస్తం

● దుబాయిలో ఇక్కట్లు పడుతున్న వారికి అండగా యువకులు
● గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు
● 300మంది వలంటీర్లు స్వచ్ఛంద సేవ

7

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

7

కొత్త పథకాలు అమలయ్యేనా..?



● ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో అనుమానాలు
● జిల్లాలో గ్రామ, వార్డు సభల్లో 72,686 దరఖాస్తులు
● ఆన్‌లైన్ నమోదుపై కొరవడిన స్పష్టత
● లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ మూడుపథకాలు నిలిచిపోనున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26న కొత్తగా నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించింది. ఇందులో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కూడా అందజేశారు. కానీ ఎన్నికల కోడ్ రావడంతో నిబంధనల ప్రకారం రైతు భరోసా మినహా మిగతా మూడు పథకాలు నిలిచిపోనున్నాయనే చర్చ జరుగుతోంది.

● జిల్లాలో 72,686 దరఖాస్తులు

ఎన్నికల హామీల అమలులో భాగంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఆత్మీయభరోసా, రేషన్ కార్డుల మంజూరు కోసం ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు తీసుకుంది. దీనికితోడు అర్హుల జాబితాలో పేర్లు లేని వారు గత నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 72,686 దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభలు ముగిసి పది రోజులు గడుస్తున్నా ఆ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై స్పష్టత రావడం లేదు. దీనికితోడు కొత్త పథకాలకు బ్రేక్ పడనుందన్న ప్రచారం జోరుగా జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకోసం 19,708 దరఖాస్తులు, రేషన్ కార్డులకు 27,858, రేషన్‌కార్డుల్లో మార్పులకోసం 14,101, రైతుభరోసాకు 1,077 ఆత్మీయభరోసాకు 9,942 దరఖాస్తులు వచ్చాయి. గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను మండల, జిల్లా కార్యాలయాలకు పంపకుండా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే ఉంచారు.

● మార్గదర్శకాలు లేకపోవడంతోనే..

గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహించిన సమయంలో దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి అర్హులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేస్తామని అధికారం యంత్రాంగం ప్రకటించింది. కానీ ప్రస్తుతం దరఖాస్తుల ఆన్‌లైన్‌పై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడలేదని చెబుతున్నారు. ఆన్‌లైన్ చేసి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారా లేదా అనే ..

మిగతా 8లో

బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన

మల్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికర కేంద్ర బృందం మల్యాలలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావో పథకంపై మహిళలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. జెండర్ స్పెషలిస్టు గౌతమి లింగ సమానత్వం, వివక్ష, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సోషల్‌మీడియా దుష్ప్రభావాల గురించి వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098 సద్వినియోగం చేసుకొని సఖీసేవలు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, శారద, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు

●రాయికల్: మండలంలోని అల్లీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమీనా తబస్సుమ్, మహిళా సాధికారత బృందం సభ్యులు బీస్వప్న పాల్గొన్నారు.

సీఆర్ఆర్ నిధులు మంజూరు

భీమారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంతో పాటు రాగోజీపేట, మన్నెగూడెం గ్రామాల్లో సీఆర్ఆర్ కింద రూ.22 లక్షల నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ నిధులతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

● కలెక్టర్ సత్యప్రసాద్



2కే రన్‌లో పాల్గొన్న వైద్యులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

జగిత్యాలఅర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, గైనకాలజీ సొసైటీల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించగా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో క్యాన్సర్ మరణాలకు కారణం వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన లోపమేనని అన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే మరణాలను నివారించ గలుగుతామన్నారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణలో వ్యాక్సిన్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీఏ వ్యాక్సిన్9 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు బాలికలకు అందించినట్లయితే వ్యాధి సంక్రమించకుండా 100శాతం అవకాశం ఉందని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయమై ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలని వైద్యులందరికీ పిలుపునిచ్చారు. గైనకాలజీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పద్మిని మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మహిళల మరణాల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు గర్భాశయ క్యాన్సర్ కారణంగానే మరణిస్తున్నారన్నారు. దీన్ని తొలి దశలో గుర్తించినట్లయితే పూర్తి స్థాయిలో నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురువా రెడ్డి, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ వొద్నాల రజిత, పట్టణంలోని ప్రముఖులు, వాకర్స్ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణారెడ్డి

ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఎన్‌సీసీఎఫ్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ వారిచే ఏర్పాటు చేసిన కందులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణారెడ్డి, డీసీఎంఎస్ అడిషనల్ బిజినెస్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన కందులు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భూమన్న, పర్యవేక్షకులు వెంకటనర్సయ్య, డీసీఎంఎస్ ఉద్యోగి నర్సింగరావు, సెంటర్ ఇంచార్జ్ సాయి, మార్కెట్ సిబ్బంది, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి



కథలాపూర్‌లో ఎంపీడీవో కార్యాలయం వద్ద దళితులు

కథలాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ సర్కారు హయాంలో రెండో విడత కింద దళితబంధు పథకం కింద ఎంపిక చేసిన అర్హులకు వెంటనే నిధులు విడుదల చేయాలని దళితులు మంగళ వారం కథలాపూర్‌లో అంబేద్కర్ విగ్రహంకు వినతిపత్రం అందించారు. ఎన్నికలకోడ్ పేరుతో దళితబంధు నిధుల కేటాయింపును నిలిపివేసినందు వల్ల ప్రభుత్వం ఉపాధి నిమిత్తం డబ్బులు యూనిట్ల స్థాపన కోసం విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి దళితబంధు సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు

అసమగ్ర కుల గణన నివేదికను రద్దు చేయాలి

కథలాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించి కుల గణన నివేదిక అసమగ్రంగా ఉందని వెంటనే రిపోర్ట్‌ను రద్దు చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం హరీశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను దెబ్బతీసే కుట్రతోనే కుల గణన రూపొందించారని ఆరోపించారు. 7శాతంగా ఉన్న అగ్రకులాలను 10శాతంగా పెంచి చూపించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. జనాభా శాతాన్ని పెంచి భావి తరాల భవిష్యత్‌ను దెబ్బతీయాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కోరుట్ల, ఫిబ్రవరి 04 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని అతిపురాతన దేవాలయమైన వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయం వేదపండితుడు బీర్నంది నరసింహాచారి మంత్రోచ్ఛరణ మధ్య ప్రత్యేక పూజలను జరిపారు. పద్మవతి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామికి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవం పట్టణంలోని పురవీధుల గుండా భక్తులకు దర్శనం ఇవ్వగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ విక్రం, జూనియర్ అసిస్టెంట్ పెడిపల్లి నర్సయ్య, ఆండాళ్‌గోష్టి బృందం, భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ దేవాలయాలలో రథసప్తమి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

●ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రథ సప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. సూర్యుడు ఉదయించే సమయంలో భక్తులు నెత్తి మీదు జిల్లేడు ఆకు పెట్టుకుని స్నానాలు ఆచరించారు. అనంతరం స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ గోపురాలపై సూర్య కిరణాలు పడి ఉండటం వల్ల అనేక మంది భక్తులు సూర్య భగవానుడిని దర్శనం చేసుకున్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ



ఆత్మనగర్‌లో బోనాలతో శివసత్తులు, పోతురాజులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 4 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్, ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిపారు. మంగళవారం రేణుక ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. భక్తులు బోనాం నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పుల మధ్య ఊరేగింపుగా పూరవీధుల గుండా ఆలయానికి బయలు దేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువతీయువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాలతో భక్తు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలువేరి విజయ్, గౌడ సంఘం అధ్యక్షుడు వన్నెల రాజమల్లయ్య, చిలివేరి రాములు, దిలీప్, శ్రీధర్‌గౌడ్, రాజు, దశగౌడ్, నాయకులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి నది మంగళిగడ్డ వద్ద జాతీయ విపత్తు నివారణ సంస్థ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పదవ బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించిన సమయంలో, ప్రమాదాలు జరిగిన సందర్భంగా ఎలా వ్యవహరించాలో ప్రజలకు సమూలంగా వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తక్షణమే తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, ఫైర్ అధికారి శ్రీకాంత్, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రైతు ఆత్మహత్యలు

● మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌లు విమర్శిం చారు. ఇవి ప్రభుత్వ హత్యలేనని దీనికి బాధ్యుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద హత్య కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీం పట్నం మండల కేంద్రానికి చెందిన పిట్టల లింగన్న అనే రైతు గత నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రైతు కమిటీ సభ్యులతో కలిసి పరామర్శించారు. రైతు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ, రైతు బంధు ఇస్తానని చెప్పి మోసం చేసిన ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధి ధ్యేయంగా అనేక పథకాలు తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ తెలంగాణ సాధించుకున్నాక గడిచిన పదేళ్లలో రైతులను రాజులుగా నిలబెట్టేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి వారి పాలిట యముడిలా తయారయ్యాడని ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల బతుకు ఆగం అయ్యిందన్నారు. ప్రభుత్వం సరైన విధానాలు అవలంబించక పోవడంతో రైతుల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోయిందన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి వాగ్దానాన్ని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికీ పలువురు రైతులకు రుణమాఫీ కాక అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే మూడు విడతలుగా ఇవ్వాల్సిన రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిన ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో రైతుల అభివృద్ధి కోసం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తే పూటకో మాట మార్చి రైతులను మోసం చేస్తున్న ఘనుడు సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రైతులకు వెంటనే రుణమాఫీ, రైతుబంధు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఏలాల శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లోక బాపురెడ్డి, నేమూరి సత్యనారాయణ, చిన్నా రెడ్డి, జెడి సుమన్, దశరథ్‌రెడ్డి, జగన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గత నెలలో కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి బంగారం, వెండి, నగదును దొంగిలించుకుపోయిన కేసులో ఇద్దరు నిందితులను కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ బిల్ల కోటేశ్వర్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. కరీంనగర్ అశోక్‌నగర్‌లో జనవరి 25న తాళం వేసిన ఇంటిలో హన్మకొండకు చెందిన బంగారి నరేష్‌కుమార్, ఎండీ ఆసిఫ్ పాషా చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. మంగళవారం తీగలవంతెన వద్ద తనిఖీల్లో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి నుంచి 3 తులాల బంగారం, 20 తులాల వెండి, లక్షా 25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు

కోనరావుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : వాల్టా చట్టాన్ని ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శివంగాలపల్లి గ్రామానికి చెందిన ఆముద రాజు గ్రామంలోని కుమ్మరిగుట్ట సమీపంలో సర్వే నంబరు 17లో వాల్టా చట్టానికి విరుద్ధంగా ఎక్స్‌కవేటర్‌తో అక్రమంగా మట్టిని తీసి చదును చేస్తుండగా తహసీల్దార్ విజయప్రకాష్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. చదునుకు ఉపయోగించిన ఎక్స్‌కవేటర్, ఇతర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.

విధులను ఆటంకపరిచిన
చిరు వ్యాపారిపై కేసు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూనియర్ అసిస్టెంట్ బండారి లక్ష్మణ్ విధులను ఆటంకపరిచిన తమలపాకుల వ్యాపారి అన్వర్‌ఖాన్‌పై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా సీఐ కోటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం గంజ్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారి సామగ్రి తొలగిస్తుండగా అన్వర్‌ఖాన్ ప్లాస్టిక్ బాటిల్‌లో ఉన్న గుర్తుతెలియని ద్రావణాన్ని పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ తనవిధులను ఆటంకపరిచాడని లక్ష్మణ్ ఫిర్యాదు చేశాడు.

రేషన్ బియ్యం పట్టివేత



తనిఖీలు చేస్తున్న అధికారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బైపాస్ రోడ్డులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని మంగళవారం సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గ్రామ శివారులో సాయికుమార్ అనే వ్యక్తి గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని సేకరించి బైపాస్‌లోనని ఒక గదిలో నిల్వ చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు దాడి చేసి 63 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు. గంగాధర సివిల్ సప్లయీస్ డీటీ ఉషా, ఎఫ్ఐ అన్వర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని రేణుకా ఎల్లమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎల్లమ్మగుడి తలుపుల తాళలను పగలగొట్టి విగ్ర హం పైఉన్న పుస్తెల తాడు ఎత్తుకెళ్లారు. ఉదయం ఆలయం వద్దకు వెళ్లిన గౌడ సంఘానికి చెందిన వారు తలుపులు పగలగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పుస్తెలతాడుతో పాటు, చిల్లర డబ్బులను దొంగిలించినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర భూమయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు కొయ్యడ సంపత్ గౌడ్, డైరెక్టర్ న్యాలం కనకయ్య గౌడ్, న్యాలం వీరయ్య గౌడ్, బుర్ర హరీష్ గౌడ కొయ్యడ మారుతీ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంటాడిన 'విధి'



విధి నిర్వహణకు వెళుతుండగా రోడ్డు ప్రమాదం

మహిళా ఎస్ఐ, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మృతి

వారిద్దరు విధి నిర్వహణకు తమ తమ ఇళ్ల నుంచి హుషారుగా బయలుదేరారు. వారిని 'విధి' వెంటాడింది. మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరినీ బలిగొంది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30), ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. శ్వేత నడుపుతున్న కారు ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నరేష్‌ను బలంగా ఢీకొంది. అనంతరం అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొంది. దీంతో శ్వేత, నరేష్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు.



మృతి చెందిన ఎస్సై శ్వేత, నరేష్ (ఫైల్)

జగిత్యాల క్రైం/గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల డీసీఆర్‌బీలో పని చేస్తున్న ఎస్సై కొక్కుల శ్వేత(30)తో పాటు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మల్యాల నరేష్ (26) దుర్మరణం చెందారు. ఇన్‌చార్జి ఎస్సై మాడ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల డీసీఆర్‌బీలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కొక్కుల శ్వేత కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి తన కారులో జగిత్యాల వస్తోంది.

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన మల్యాల నరేష్ విధుల నిమిత్తం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు ద్విచక్ర వాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ రెవెన్యూ శివారులోని వంతెన సమీపంలో శ్వేత కారు ఎదురుగా వస్తున్న నరేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అదే వేగంతో కారు చెట్టుకు ఢీకొనడంతో ఎస్సై శ్వేత అక్కడికక్కడే మృతిచెందింది. ద్విచక్ర వాహనంపై ఉన్న నరేష్ రోడ్డు ప్రక్కన పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

● సీట్ బెల్ట్ పెట్టుకుని ఉంటే..

ఎస్ఐ శ్వేత సీట్ బెల్ట్ ధరించి ఉంటే కారుకు ఉన్న ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకుని ప్రమాదం నుంచి ఎస్సై బయట పడే అవకాశం ఉండేది. ఎస్సై శ్వేత కారును



ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తున్న జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్

అదుపు చేయలేక పోవడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఎస్పీ అశోక్ కుమార్‌తో పాటు డీఎస్పీ రఘుచందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృత దేహాలను అప్పగించారు. నరేష్‌కు ఇటీవల వివాహం నిశ్చయమైంది.

పోలీస్ శాఖలో విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ శ్వేత మృతి చెందడంతో జిల్లా పోలీస్ శాఖలో విషాదం నింపింది. నిన్నటి దాకా తమతో విధులు నిర్వహించిన ఎస్సై రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు పోలీస్ అధికారులు కంటతడి పెట్టారు. శ్వేత జిల్లాలోని వెల్గటూర్, కథలాపూర్, కోరుట్ల, పెగడపల్లి మండలాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. ఎస్పీ అశోక్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్సై శ్వేత కుటుంబ సభ్యులను ఎస్పీ పరామర్శించారు.

నరేశ్ స్వగ్రామం ముత్యంపేటలో విషాదం

మల్యాల: నరేశ్ మృతితో మల్యాల మండలం ముత్యంపేటలో విషాదం నెలకొంది. నిరుపేద వ్యవసాయ కూలీలైన మల్యాల నర్సయ్య-లక్ష్మి దంపతుల రెండో కుమారుడైన నరేశ్ గతంలో లక్షెట్టిపేటకు రోజూ బస్సులో వెళ్లేవాడు. 15 రోజులుగా ద్విచక్ర వాహనంపై చిల్వకోడూర్ మీదుగా లక్షెట్టిపేట వెళ్తున్నాడు. గతంలో మాదిరిగా జగిత్యాల నుంచి బస్‌లో వెళ్లినా బతికేవాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని ముత్యంపేటకు తీసుకువచ్చారు. మృతుడి సోదరుడు దుబాయి నుంచి మంగళవారం బయల్దేరడంతో అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నారు.



కష్టపడి చదివి.. కానిస్టేబుల్ నుంచి ఎస్ఐగా ఎదిగి..

ఇంటి నుంచి బయల్దేరిన గంటకే మృతి

చొప్పదండి: పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని పైకి వచ్చిందుకున్న తరుణంలో రోడ్డు ప్రమాదం ఆమెను బలిగొనడం ఆర్నకొండ గ్రామంలో విషాదాన్ని నింపింది. ఉదయం హుషారుగా ఇంటి నుంచి బయలుదేరిన గంటకే మరణవార్త విన్న తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. చొప్పదండి మం డలం ఆర్నకొండకు చెందిన కొక్కుల శ్వేత గొల్లపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. ఆర్నకొండకు చెందిన లక్ష్మీనారాయణ- సుజాత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె శ్వేత. వీరిలో శ్వేత పెద్దది. పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. 2016లో డిగ్రీ పూర్తి చేసిన శ్వేత పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించింది. కష్టపడి చదివి పెద్ద ఉద్యోగం సాధించాలనే తపనతో 2019లో ఎస్ఐ ఉద్యోగాన్ని శ్వేత సాధించింది. మండలం నుంచి మహిళా ఎస్ఐగా ఎంపికై పలువురు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. జగిత్యాల జిల్లాలో ఎస్ఐగా సేవలందించింది. తమ కూతురికి ఉన్నత ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు, సోదరులు ఎంతో సంతోషపడ్డారు. చిన్న కుటుంబం నుంచి పట్టుదలతో చదివిపైకి వచ్చిన శ్వేత రోడ్డు ప్రమాదంలో మరణించడం గ్రామస్థులను తీవ్రంగా కలచి వేసింది. ఉదయం ఇంటి నుంచి శ్వేత కారులో వెళ్లి సాయంత్రానికి శవమై తిరిగి రావడంతో గ్రామస్థులను కంటతడి పెట్టించింది. పోలీసు శాఖలో చిన్న వయస్సులోనే ఎస్ఐ ఉద్యోగం రాగా ఉన్నత స్థాయికి చేరుకుంటుందని మురిసిపోతున్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు...

ఆర్నకొండలో శ్వేత అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి లక్ష్మీనారాయణ అంత్యక్రియలను నిర్వహించగా పలువురు పోలీసు అధికారులు హాజరయ్యారు. మండలం నుంచి పలువురు నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో అంత్యక్రియలకు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడి మృతి

మస్తాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్రాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. మోర్రాపూర్ గ్రామానికి చెందిన భూక్య రాంచరణ్(16) అనే యువకుడు తన స్నేహితులు బట్టు చందు, వరుణ్ కృష్ణలతో కలిసి గ్రామంలోని చెరువును చూసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు రాంచరణ్ కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. మృతుడి తండ్రి రవీందర్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మృతుడు ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్నాడు.

వృద్ధుడి ఆత్మహత్య

మానకొండూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నల్లగాశే చిన్నరాజయ్య (60) అనే వృద్ధుడు మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ లక్ష్మినారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఊటూర్‌కు చెందిన చిన్నరాజయ్యకు కళ్లు సరిగా కనిపించకపోవడమే కాకుండా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి పశువుల పాకలో పడుకొని మంగళవారం తెల్లవారే సరికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పించిన వ్యక్తి అరెస్టు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ వెరిఫికేషన్ కోసం తప్పుడు అఫిడవిట్ సమర్పించిన గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన నర్సింగోజు రాజేష్ కుమార్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. తమపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ చూపించి వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఎస్‌బీ విచారణలో ఒక క్రిమినల్ కేసు ఉన్నట్టు తేలింది. దీంతో దరఖాస్తుదారుడిపై కేసు నమోదు చేయాల్సిందిగా ఎస్‌బీ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు సూచించడంతో మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హరిహరకాలనీకి చెందిన పోడపత్రం ధర్మపురి(45) అనే గల్ఫ్ ఏజెంట్‌ను మంగళవారం అరెస్ట్‌చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం చిన్నబోనాలకు చెందిన పడిగే శంకర్, పడిగే రమేశ్, కాలువ నవీన్‌లు నకిలీ గల్ఫ్ ఏజెంట్ అయిన ధర్మపురిని నమ్మి ఒక్కొక్కరు రూ.95వేల చొప్పున అతనికి ఇచ్చి కంపెనీ విసా అని చెప్పి నమ్మించి మాల్దీవ్స్ దేశానికి పంపారన్నారు. మాల్దీవ్స్‌లో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ పనులు చేయిస్తూ సరైన భోజనం, అకామిడేషన్ ఇవ్వకుండా ఇబ్బంది పడి అనారోగ్యానికి గురై మోసపోయినట్లు వారి కుటుంబ సభ్యులకు తెలుపడంతో స్థానిక మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ ద్వారా పడిగే రజిత ఫిర్యాదు మేరకు ఏజెంట్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉపాధికోసం వెళ్లే యువకులు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పాత వాడకు చెందిన మంద కిషన్ అనే గీత కార్మికుడు సోమవారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. సుగ్లాంపల్లిలోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో పక్క ఎముకలు, తొంటి విరిగింది. ప్రస్తుతం అతను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిషన్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గీత కార్మికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కిషన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సారయ్య గౌడ్ తదితరులు పరామర్శించారు.

అప్పుల బాధతో గల్ఫ్ కార్మికుడి బలవన్మరణం

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు చొప్పరి తిరుపతి (46) అప్పుల బాధతో ఇంటి ఆవరణలో ఉరేసుకుని మంగళవారం తెల్లవారుజామున బలవన్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పేద కుటుంబానికి చెందిన తిరుపతి కొన్నేళ్ల క్రితం అప్పు చేసి గల్ఫ్ దేశం వెళ్లాడు. కానీ అక్కడ చాలీచాలని వేతనంతో అప్పులు తడిసిమోపెడయ్యాయి. సుమారు 16 సంవత్సరాలు దుబాయ్ దేశం వెళ్లినా అప్పులు తీరలేదు. దీంతో నాలుగు నెలల క్రితం ఇంటికి తిరిగివచ్చాడు. అనంతరం మూడు నెలల క్రితం దోహా ఖతర్ దేశం వెళ్లగా అక్కడ పక్షవాతం రావడంతో కంపెనీ యాజమాన్యం పదిహేను రోజులకే ఇంటికి తిప్పి పంపింది. దీంతో గతంలో ఉన్న అప్పులకు తోడు చికిత్స కోసం అప్పులు చేశాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



తిరుపతి (ఫైల్)

కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈసాలతక్కల్లపల్లి గ్రామంలో మంగళవారం కోతుల దాడిలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామానికి చెందిన తిప్పని మల్లేష్ స్థానిక ఇండియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద డబ్బులు డ్రా చేయడానికి వెళ్లగా అక్కడే ఉన్న కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేశాయి.

గమనించిన గ్రామస్థులు కర్రలతో కోతులను బెదిరించగా అవి పారిపోయాయని తెలిపారు. గాయపడిన మల్లేష్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా నిర్వాహకులు బైండోవర్

కాల్వశ్రీరాంపూర్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొల్లి సమ్మవ్వ, పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన పూదరి సదయ్య గతంలో గుడుంబా అమ్ముతూ బైండోవర్ అయ్యారు. బైండో వర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ గుడుంబా అమ్ముతుండడంతో మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై మాట్లాడు తూ గుడుంబా అమ్మిన, తయారు చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రయోగాలు చేసేదెలా సారూ..

● శిథిలావస్థలో జూనియర్ కళాశాల ల్యాబ్ గదులు

● భయం నీడలో విద్యార్థులు..



సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేక అధ్యాపకులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో 532 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థలకు చేరుకున్నాయి. ఆయా గదుల్లో ప్రయోగాలను చేసేందుకు విద్యార్థులు జంకుతున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్‌కు సంబంధించిన పరికరాలతోపాటు ఈవీఎంలను పోలింగ్ అధికారులు భద్ర పర్చారు. 1969లో కళాశాలలో నిర్మించిన గదుల కు ఏర్పాటు చేసిన సిమెంట్ రేకులు పగిలి పోవడంతోపాటు గోడలు సైతం వర్షాలకు తడిసి కూలి పోయిన వాటిల్లోనే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో కళా శాలలో చదు వుతున్న 532 మంది విద్యార్థులు తమకు సంబంధించిన ల్యాబ్ ప్రయోగాలను చేసేందుకు పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియక భయం నీడలో ప్రయోగాలు చేస్తున్నారు.

పోలింగ్ సామగ్రితో పాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గదుల ను ఖాళీ చేయాలని కళాశాల ప్రిన్సిపల్ పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలను అందించినా ఎలాంటి ఫలితం లేక పోవడంతో శిథిలావస్థకు చేరిన గదులల్లోనే ల్యాబ్‌లను కొన సాగి స్తున్నారు. కలెక్టర్ స్పందించి కళాశాలలో శిథిలావస్థకు చేరిన గదులను పరిశీలించి పోలింగ్ సామగ్రితో పాటు ఈవీ ఎంలు భద్రపరిచిన గదులను ఖాళీచేసి కళాశాలకు అందించాలని అధ్యాపకులతోపాటు విద్యార్థులు కోరుతున్నారు.



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శిథిలావస్థకు చేరిన ల్యాబ్ గదులు

ఎప్పుడు కూలుతుందో తెలియదు

అక్షయ, ఇంటర్ సెకండియర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ల్యాబ్ గదులు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. ఆయా గదుల్లో ఏర్పాటుచేసిన ల్యాబ్‌లలో ప్రయోగాలు చేయాలంటే భయం వేస్తోంది. నూతన గదుల్లో పోలింగ్ సామగ్రితో పాటు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. వాటిని ఖాళీ చేయాలి.

ప్రయోగాలు చేయాలంటేనే భయం..

అల్తాఫ్, ఇంటర్ విద్యార్థి



సిరిసిల్ల ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో ప్రయోగాలు చేయాలంటేనే భయంతో వణికిపోతున్నాం. కళాశాలలో సరైన గదులు లేకపోవడంతో అందులోనే ప్రయోగాలను చేసేందుకు ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వాటిని మార్పు చేయాలి.

పోలింగ్ సామగ్రిని తరలించాలి..

కనకశ్రీ విజయరఘునందన్, కళాశాల ప్రిన్సిపాల్



సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1969లో నిర్మించిన రేకుల షెడ్లలోనే ప్రస్తుతం ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. గదులు శిథిలావస్థకు చేరడంతో ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన గదుల్లో పోలింగ్ సామగ్రిని ఖాళీచేయాలని కలెక్టర్‌కు పలుమార్లు వినతి పత్రాలను అందించిన ప్రయోజనం లేకుండా పోయింది. కలెక్టర్ స్పందించి గదులను ఖాళీ చేయిస్తే ల్యాబ్‌లను అందులోకి మార్చుస్తాం.



ఈ భవంతికి 84 ఏళ్లు..

నాటి పనితనానికి అద్దం పడుతున్న వైనం

రాచర్ల తిమ్మాపూర్‌లో ఆకట్టుకుంటున్న రెండంతస్తుల భవంతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డంగు సున్నం.. టేకు కల ప.. విశాలమైన స్థలంలో నిర్మించిన భవనం 84 ఏళ్లుగా చెక్కుచెదరకుం డా అప్పటి కూలీల పని తీరుకు అద్దం పడుతోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలోని రామగిరి మారుతిరావు ఇళ్లు ఆకట్టుకుంటోంది. రెండంతస్తుల భవనంలో విశాలమైన గదులు, విశ్రాం త గది, రెండు బెడ్ రూంలు, వంట గది, పూజ గదులతో పాటు మొత్తం 18 గదులున్నాయి. ఇప్పటికీ చెక్కుచెదరకుండా భవంతి కనిపిస్తోంది.

బ్రిటీష్ కాలంలో నిర్మాణం

మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన రామగిరి మారుతిరావు తాత నర్సింగారావు 1941లో సుమారు రూ.50వేలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి డంగు సున్నం వినియోగించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. రెండంతస్థుల భవనం ముందు కమాన్, ఇంటిలోకి వెళ్లగానే హాలు, రెండు బెడ్‌రూంలు, పూజ, వంట, భోజనశాలతో మరో 4 గదులున్నాయి. పైఅంతస్థులోనూ విశాలమైన గదులను నిర్మించారు. నర్సింగారావు కుమారుడు తిరుపతిరావు వృత్తిరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయన భార్య ఉమాదేవి, కొడుకు మారుతిరావులు అక్కడే ఉం టున్నారు. తిరుపతిరావు రెండేళ్ల కిందట మృతిచెందారు. గత యేడాది ఆయన సంవత్సరీకం కార్యక్రమాన్ని స్వగ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. స్వగ్రామంలోని తాతల నాటి ఇంటిని మర్చిపోకూడదని మారుతిరావు ఇటీవల రూ.5 లక్షలు వెచ్చించి మరమ్మతు పనులు చేపట్టారు. 84 ఏళ్ల భవంతిని చూసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.




భవనం కమాన్

ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ ఉద్యోగాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఉమ్మడి జిల్లా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఫిబ్రవరి 9వ తేదీ వరకు వెబ్‌సైట్ cle. cgg. gov.inలో దరఖాస్తు చేసుకో వాల ని సూచించారు. ఈ నెల12 నుంచి 14 వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 0878-2268686 నంబరులో గానీ, కరీంనగర్‌లోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కళారవళి సోసియో కల్చరల్ అసోసియేషన్, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త నిర్వహణలో 15 గంటల చిరుతల భజన వరల్డ్ రికార్డు కోసం 33 జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వహణ బాధ్యులు కృపాదానం, విష్ణుదాస్ గోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులను విష్ణుదాస్ గోపాలరావు, ఇంటి నంబరు. 3-101/2, అహల్యనగర్, బోర్నపల్లి, హుజూరాబాద్, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని, వివరాలకు 94402 39793 నంబరులో సంప్రదించాలని సూచించారు.





ఎమ్మెల్సీ బరిలో బీఆర్ఎస్ లేనట్లే..

- పార్టీలో ప్రసన్న హరికృష్ణ చేరికకు బ్రేక్..
- గ్రీన్ సిగ్నల్ ఇవ్వని అధినేత కేసీఆర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల బరి నుంచి బీఆర్ఎస్ తప్పుకున్నట్లు సమాచారం. ఎన్నికల హడావుడి ప్రారంభమైన నాటి నుంచి ఆ పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో ఎలాంటి సమావేశం నిర్వహించలేదు.. ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టేందుకు పార్టీ శ్రేణులకు ఆదేశాలివ్వలేదు. దీంతో బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను నిలపకపోవచ్చనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మూడు రోజుల క్రితం ఎన్నికల విషయంలో కదలిక వచ్చింది.

కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయ త్నించి భంగపడిన ప్రసన్న హరికృష్ణ బీఆర్ఎస్ నుం చి పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ అధినేత కేసీఆర్‌ను కలువడానికి ప్రయత్నించారని వార్తలు వచ్చాయి. కాదు పార్టీనే హరికృష్ణను పార్టీ అభ్యర్థిగా పోటీచేయమని ప్రతిపాదించి చర్చించిందని ప్రచారం జరిగింది. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఇంతకాలం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెబుతూ వస్తూ నాలుగు నెలలుగా ఓటరు నమోదు చేపట్టి పనిలో ప్రచారం కూడా నిర్వహించారు. ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ తర్వాతే హరికృష్ణకు అభ్యర్థిత్వం ప్రకటిస్తారని ప్రచారం జరిగింది.

బరిలోనే ఉంటానంటున్న సర్దార్ రవీందర్‌సింగ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచనకు స్వస్తి చెప్పి స్థానిక ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలు వైఫల్యాలపై దృష్టి సారించి పార్టీశ్రేణుల్లో ఉత్తేజం నింపాలని ఆదేశించినట్లు సమాచారం. సోమవారం జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ శ్రేణులకు రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తానని అంటున్నారని, ఆయనకు మనం అండగా నిలుద్దామంటూ చెప్పడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. రవీందర్‌సింగ్ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటారని ఆమె చెప్పకనే చెప్పారు. దానికితోడు ప్రసన్నహరికృష్ణ బీఆర్ఎస్‌లో చేరే ఆలోచనను విరమించుకున్నారు. ఇండిపెండెంట్‌గానే బరిలో ఉంటారంటూ ఆయన సన్నిహితులు ప్రచారంలో చేయడం కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని నిలపడం లేదనే అభిప్రాయానికి బలాన్ని చేకూర్చుతున్నది. బీఆర్ఎస్ అభ్యర్థులుగా పట్టభద్రుల స్థానంపై రవీందర్‌సింగ్‌తోపాటు ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు కూడా ఆశలు పెట్టుకున్నారు. వీరిలో శేఖర్‌రావు ముందుగానే పార్టీ ఏ విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాను ఇండిపెండెంట్‌గానే పోటీచేస్తానని ప్రకటించి, ప్రచారం చేసుకుంటున్నారు.

డాక్టర్ బీఎన్ రావు పార్టీ అభ్యర్థిని రంగంలో ఉంచని నేపథ్యంలో తాను పోటీ చేయబోనని చెప్పారు. రవీందర్‌సింగ్ మాత్రం ఇప్పటికీ తన ప్రచారాన్ని కొనసాగిస్తూ ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పార్టీల నేతలతో తనకున్న సంబంధాల నేపథ్యంలో ఉద్యమకారులు, అన్ని పార్టీల్లోని మిత్రులు, అసంతృప్తివాదులు తనకు ఓటు వేస్తారని, స్థానిక అభ్యర్థిగా తాను ప్రధాన పోటీదారుగా ఉంటానని ఆయన చెబుతున్నారు. ఎమ్మెల్సీ కవిత మద్దతు ప్రకటించిన నేపథ్యంలో జాగృతి శ్రేణులు రవీందర్‌సింగ్‌కు ప్రచారం చేస్తున్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి

కరీంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేముల కరుణాకర్‌రెడ్డి (తీగల ధర్మారం, ధర్మపురి), పిడిశెట్టి రాజు (వెంకటేశ్వరపల్లి, కోహెడ), టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి (మంచిర్యాల) నామినేషన్లు వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు ఎనిమిది మంది, టీచర్ స్థానానికి నలుగురు మొత్తం 12 మంది 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

యూపీఎస్‌ను అడ్డుకోవాలంటే

ఇన్నారెడ్డిని ఆశీర్వదించండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను అడ్డుకోవాలంటే తెలంగాణ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ బలపరిచిన అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డిని ఆశీర్వదించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, రవికుమార్‌తో కలిసి ఇన్నారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న యూపీఎస్ విధానాన్ని అడ్డుకోవడానికి సీపీఎస్ అభ్యర్థి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్నాడని తెలిపారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఇన్నారెడ్డి

సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యం

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి



ఎస్‌యూలో జాతీయ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్రాల మధ్య సమగ్ర సహకారం, సుస్థిర అభివృద్ధే వికసిత్ భారత్ లక్ష్యమని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్-2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్ మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ సరళీకరణ, ప్రైవేటీ కరణ తర్వాత భారత్ విద్యారంగంలో విజయవంతమైందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ దేశం ఇంకా అనేక రంగాల్లో అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం అభివృద్ధిలోముందుకెళ్తోందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకు లపతి ప్రొఫెసర్ సాయన్న మాట్లాడుతూ భారత్ పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ దేశం పారిశ్రామిక, సేవా రంగాలలో త్వరిత గతిన వృద్ధి సాధించినా వ్యవసాయ రంగం లో విప్లవాత్మకమైన మార్పులు రావాలని, అప్పుడే గ్రామీణ భారత్ అభివృద్ధి చెందుతుం దని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగపు సీనియర్ ఆచార్యులు, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్. సూరేపల్లి సుజాత, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కోడూరు శ్రీవాణి, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, యూజీసీ అఫైర్స్, ఉమెన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా వచ్చిన భక్తులతో కొండంతా రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సుమారు ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



అభిరామ్



ప్రేమ్

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో 11స్టాగ్ తెలంగాణ స్టేట్ అండ్ ఇంటర్ డిస్ట్రిక్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ పోటీల్లో జగిత్యాలకు చెందిన బొడిగె అభిరామ్, అలిశెట్టి ప్రేమ్‌లు అండర్-15 విభాగంలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ పొడేటి శ్రీకాంత్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్నాయన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమేట అశోక్ అభినందించారు.

బోనమో నమః

- బద్ది పోచమ్మకు బోనాల జాతర
- ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించిన భక్తులు



బోనాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి అనుబంధ శ్రీబద్దిపోచమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసి పోయింది.. బద్దిపోచమ్మ తల్లికి ఇష్టమైన మంగళవారం బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో మంగళవారం అమ్మవారికి బోనం తీసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

తెల్లవారు జామునే భక్తులు మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మండపంలో అమ్మవారికి పట్నాలు వేసి నూతన వస్త్రాలతో ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం నైవేద్యాన్ని పెట్టి శ్రీబద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని, కల్లు సాక పెడుతూ పిల్లపాపలు, పాడిపంటలు చల్లగా ఉండాలని, మళ్లీ వచ్చే యేడుకు తిరిగి వచ్చి మరింత ఘనంగా జాతర నిర్వహించు కుంటా మని మొక్కులు చెల్లించుకున్నారు.

కాగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ క్యూలైన్‌లో భక్తులతో కిక్కిరిసిపోయాయి. నెత్తిన బోనాలతో భక్తులు సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించారు. క్యూలైన్లు త్వరగా కదిలేందుకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఇన్‌చార్జీ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కాగా బద్ది పోచమ్మ ఆలయం ఎదుట బలిచ్చే జీవాలకు కల్లు సాక పెట్టేందుకు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నట్లు భక్తులు ఆవేధన వ్యక్తం చేశారు. ఆలయాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

గల్ఫ్ బాధితులకు ఆపన్నహస్తం



దుబాయిలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు

- దుబాయిలో ఇక్కట్లు పడుతున్న వారికి అండగా యువకులు
- గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు
- 300మంది వలంటీర్లు స్వచ్ఛంద సేవ

మల్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి వెళ్లి అక్కడ అనుకోని ఆపదలో చిక్కుకున్న అభాగ్యులకు గల్ఫ్ కార్మి కుల రక్షణ సమితి అనే స్వచ్ఛంద సంస్థ అండ గా నిలుస్తోంది. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన ఆరే శేఖర్ అనే యువకుడు 15 ఏళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. మొదటి నుంచి సేవా గుణం కలిగిన శేఖర్ 2015లో గుండల్లి నర్సింహ అనే యువకుడితో కలిసి స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. 300 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

దుబాయిలో జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న కార్మికులను, అనారోగ్య బాధితు లను ఆదుకుంటున్నారు. చనిపోయిన వారి మృతదేహాలు స్వస్థలాలకు పంపించడంలో జాప్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. దుబాయి ఆమ్నెస్టితో పాస్ పోర్టులు లేక చాలా మంది విమాన టికెట్లు పొందలేని పరిస్థితి నెలకొంది. దీంతో గతంలో బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేసిన శేఖర్ తన పాత పరిచయాలతో తెలుగు వారిని స్వగ్రామాలకు రప్పించడానికి మిత్రుడు శ్రీధర్ గౌడ్ ద్వారా 560మందికి విమాన టికెట్లు సమకూర్చి ఇళ్లకు పంపించారు. మిత్రుల ద్వారా కొంత మేర డబ్బు ప్రోగు చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


వేలాది మందికి అండగా..

స్వచ్ఛంద సంస్థ ప్రారంభించినప్పటి నుంచి పదివేల మందికి పైగా దుబాయి బాధితులకు అండగా నిలిచారు. కంపెనీల్లో జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు వేల మందిని ఆదుకున్నారు. ఆత్మహత్యలు, రోడ్డుప్రమాదాలు తదితర కారణాలతో మృతి చెందిన సుమారు వెయ్యికి పైగా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు. అనారోగ్యంతో ఆసుపత్రిల్లో చేరి బిల్లు కట్టలేని వారి గురించి కాన్సులెట్ అధికారులతో మాట్లాడి ఇప్పటి వరకు రూ.5కోట్ల వరకు మాఫీ చేయించడానికి కృషి చేశారు.

స్వస్థలాలకు పంపిం చని మృతదేహాలకు దుబాయిలోనే వీరు అంత్యక్రియలు నిర్వహిస్తారు. కంపెనీ నుంచి బయటకు వచ్చి తిండి కోసం ఇబ్బందులు పడుతున్న వారికి భోజన వసతితో పాటు ఆశ్రయం కల్పిస్తారు. జీతాలు ఇవ్వని కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిం చడంతో పాటు తెలియక చేసిన నేరాలకు జైలు శిక్ష అనుభవిస్తున్న కార్మికులను జైలు నుంచి విడిపించి ఇళ్లకు పంపించేందుకు ఈ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. దుబాయిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ యువకులు అందరి మన్ననలు పొందుతున్నారు.

సమాచారం అందిస్తే చాలు


గుండల్లి నర్సింహ, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు



దుబాయిలో ఇబ్బందులు పడుతున్న వారికి మా వంతుగా సేవలు అందిస్తున్నాం. ఇబ్బందులు ఉన్న వారు మాకు సమాచారం అందిస్తే వారికి అండగా నిలుస్తాం. ఇప్పటికే వేల మందికి మా స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందించాం. ఇందులో మా మిత్రులు, దుబాయి అధికారుల సహకారం మరువలేనిది. భవిష్యత్తులో మా సేవలను మరింతగా విస్తృతం చేస్తాం.

సేవలతో మానసిక సంతృప్తి

ఆరె శేఖర్, ఉపాధ్యక్షుడు



దుబాయి వెళ్లకముందు మా గ్రామంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. అక్కడికి వెళ్లిన తరువాత తెలుగువాళ్లు ఎదుర్కొంటున్న కష్టాలు చూసి మనసు చలించింది. దీంతో మిత్రులతో కలిసి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాం. అనేక మంది తమ సమస్యలను మా దృష్టికి తేవడంతో అక్కడికి వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సామాజిక సేవతో మానసిక సంతృప్తి కలుగుతుంది.



దుబాయిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువకులు,



కూలీలకు అందజేసేందుకు సిద్ధం చేసిన బియ్యం

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి వర్గాలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాబీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నలువాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

●కొడిమ్యాల: ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రాకేష్, భూమేష్, అఖిల్, రాజు, చిరంజీవి, రాహుల్, అనిల్ తదితరులు ఉన్నారు.

●మెట్‌పల్లిటౌన్ : బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం పాత బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్, లావణ్య, రజిని, ముత్యంరెడ్డి, సత్యనారయణ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ధర్మపురి: బీజేపీ ధర్మపురి మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి ఆధ్వర్యంలో ధర్మపురి పట్టణంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు.

ఇబ్బందులు పరిష్కరించాలి

ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ఆవులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని కోరుతూ ధర్మపురి మండల యువజన కాంగ్రెస్ అప్పం తిరుపతి ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాపర్తి సాయికిరణ్, యువజన కాంగ్రెస్ నాయకులు జంజిరికాని గణేష్, జంజిరికాని భరత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మంగళవారం మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన బేతెల్లి అమరేందర్‌రెడ్డి అంజలి దంపతులు 25వేల 116 రూపాయల నగదును అందించినట్లు ఆలయ పూజారి నాగరాజు రమేష్ తెలిపారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పంటల సంరక్షణపై అవగాహన

కొడిమ్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అడవి పందుల బెడద-పంటల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, మాజీ సర్పంచు రాంరెడ్డి, ఏఈవో రాజేష్ పాల్గొన్నారు.

వాటర్‌గ్రిడ్‌లో సాంకేతిక లోపం.. అందని రక్షిత నీరు

-వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్న కోరుట్ల ప్రజలు -సమస్య పరిష్కరించాలని వినతి

కోరుట్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వాటర్‌గ్రిడ్‌లో సాంకేతికలోపంతో కోరుట్ల పట్టణ ప్రజలు వారం రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో నిర్మాణం చేసిన వాటర్ గ్రిడ్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో వారం రోజులుగా నీటి సరఫరా లేక బోర్లను ప్రజలు ఆశ్రమిస్తున్నారు. మున్సిపల్ అధికారులు వివిధ వార్డులలో ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నా సమస్య పరిష్కారం కావకపోవడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. గత ప్రభుత్వం ఇబ్రహీపట్నం మండలంలోని డబ్బా గ్రామం వద్ద నీటి సరఫరా కొరకు వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక పైప లైన ద్వారా పట్టణానికి నీటి సరఫరా చేసింది. ఈ క్రమంలో పట్టణంలో 8 ప్రాంతాలలో వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి నీటి సరఫరా చేశారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఒక వాటర్ ట్యాంక్, ఐడి రోడ్డులో రెండు వాటర్ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్, అల్లమయ్య గుట్ట ప్రాంతంలో ఒక వాటర్ ట్యాంక్, మున్సిపల్ అవరణలో వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి వాటర్ గ్రిడ్ పైపులైన్‌కు అనుసంధానం చేసి నీటిని అందించడానికి ఏర్పాట్లను చేశారు. వారం రోజుల క్రితం వాటర్ గ్రిడ్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో పాటు మెట్‌పల్లి మండలం వెంకటరావుపేట గ్రామ శివారులో పైపులైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరాలో సమస్య తలెత్తింది. ఉన్నతాధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నియామకం

కొడిమ్యాల, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ గ్రామంలో మంగళవారం గీతా పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గౌడ సంఘం అధ్యక్షునిగా చల్లూరి శ్రీనివాస్‌గౌడ్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా గడ్డమీది మల్లేశంగౌడ్, డైరెక్టర్లుగా బుర్ర గంగయ్య గౌడ్, కందుల పర్షరాములుగౌడ్, తీగల శ్రీనివాస్‌గౌడ్, గడ్డమీది మహేష్‌గౌడ్, సుద్దపల్లి పర్షరాములుగౌడ్‌లను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల కుర్తి గ్రామానికి చెందిన బర్మ నాగేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జనసేన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సినియర్ నాయకులు ఓడ్నాల రామరావు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులకు అండగా ఉండేందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కార్యకర్తలకు 5 లక్షల ఇన్సూరెన్స్ చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన సైనికులు రాధరపు ప్రభాకర్, నరేందర్, మాసం విజయ్, అభినవ్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాయికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని 32 గ్రామ పంచాయతీలు, 276 వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులతో ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా అభ్యంతరాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.చిరంజీవి, ఎంపీవో సుష్మా, ఏఈ పీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

●మల్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం ప్రచురించబడిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల గురించి మంగళవారం రాజకీయ పార్టీల నేతలతో ఎంపీడీవో స్వాతి సమావేశం నిర్వహించారు. వారి నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, మండల పరిషత్ పర్యవేక్షకులు నాగరాజు తదిదతరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబందించి ఓటరు జాబితా చేర్పులు, మార్పులపై మంగళవారం ఎంపీడీవో ఇ. స్వరూప మండలంలోని రాజకీయ పార్టీల ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ సురేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, బీజేపీ సీనయర్ నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

●పెగడపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల రెండవ సాదారణ ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌లో బాగంగా పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీలలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రతులను ప్రదర్శించామన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్‌తో పాటు పార్టీల నాయకులు శ్రీనివాస్, లోక మల్లారెడ్డి, ఇరుగురాల భూమేశ్వర్, కొమురెల్లి, విజయభాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం


పైపులైను పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) :ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వెంకట్రావ్‌పేట గ్రామ శివారులో జరుగుతున్న మిషన్ భగీరత పైపులైను మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురో గతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. మిషన్ భగీరథ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పైపు లైను లీకేజీలు, మరమ్మతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలకు నిరంతర నీటి సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, డిఆర్డిఓ రఘువరన్, ఈఈ శేఖర్‌రెడ్డి, డిఈ ప్రేమ్ కుమార్, కమిషనర్ టి.మోహన్, తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడాలి

భీమారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ అన్నారు. మండలంలోని మోత్కురావుపేట గ్రామంలో వరి పొలాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. వరి, మొక్కజొన్నలో సిఫారసు చేయబడిన మోతాదుకంటే అధిక మొత్తంలో యూరియా వేయడం వల్ల మొక్క రసభరితమై ముగి పురుగు, సుడి దోమ, ఇతర శిలీంధ్ర రోగాలకు దారి తీస్తుందని వివరించారు. వరి పెరుగుదలకు జింక్ 12 శాతం, జింక్ 33 శాతంగాని స్ప్రే చేయడం వల్ల మొక్కల ఎదుగుదల పెరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో రైతులు శ్రీనివాస్, జనార్ధన్, సతీష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పథకాలు అమలయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

దానిపై వారి వద్ద సమాధానం లేకపోవడం గమనార్హం. తమ దరఖాస్తులను కార్యాలయాల్లో చూసి తాము పథకాలకు అర్హులమో కాదోనని పలువురు ఆందోళన చెందుతున్నారు.

●దరఖాస్తుల పునః పరిశీలన

జిల్లాస్థాయి అధికారులు మౌళిక ఆదేశాలతో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను మాత్రం పంచాయతీ కార్యదర్శులు పునఃపరిశీలన చేసే ప్రక్రియను ప్రారంభించారు. దరఖాస్తులను నాలుగు (ఎల్-1, ఎల్-2, ఎల్-3 , ఎల్-4) కేటగిరీలుగా విభజించే పని పూర్తి చేశారు. ఇందులో ఎల్-1 కేటగిరీలోని సొంత స్థలం ఉండి ఇళ్లు లేని వారి దరఖాస్తులను గుర్తించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దరఖాస్తు చేసుకున్నవారు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని పని దినాలు పూర్తి చేశారనే వివరాలు సేకరించారు. కొత్త రేషన్ కార్డులు, యూనిట్ల నమోదుకు వచ్చిన దరఖాస్తుల పరిశీలనపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు వెలువడకపోవడం గమనార్హం.

●పైలెట్ ప్రాజెక్టు కింద మండలానికో గ్రామం ఎంపిక

జిల్లాలో ఇప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లోనే పథకాలను అమలు చేసిన ప్రభుత్వం మిగతా గ్రామాలు, వార్డుల్లో అమలు విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. అర్హులందరికీ ఒకేసారి ఇస్తారా..? లేక విడతల వారీగా ఇస్తారా అనే దానిపై కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొదటి విడతలో ఇస్తామని చెప్పారు. మిగితా గ్రామాల్లో ఏ వర్గానికి ఎప్పుడు ఇస్తారనే విషయమై స్పష్టత లేక దరఖాస్తుదారులు అయోమయంలో ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్తగా ఎలాంటి పథకాలను ప్రారంభించవద్దనే నిబంధన ఉంటుంది. అంతకుముందే ప్రారంభించిన పథకాలను అమలు చేస్తారన్న ఒక చర్చ, ఎన్నికల కోడ్ మార్చి 8వ తేదీన ముగుస్తుందని ఆ తర్వాతే అమలు చేస్తారన్న మరో చర్చ సాగుతోంది. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వస్తేనే పథకాల అమలుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు నివృత్తి అయ్యే అవకాశాలున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో ఈ వేడుకలు నిర్వహించారు అనంతరం స్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, ఓరియంటల్ కళాశాల సెక్రటరీ సంగనభట్ల రామకిష్టయ్య, స్కూల్ డైరెక్టరులు గట్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంగనభట్ల సంతోషి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల ఆందోళన

భీమారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని బీసీ కాలనీవాసులు మంగళవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారని ఆందోళన వ్యక్తం చేశారు. 2008లో కొమిరెడ్డి రామ్‌లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాలనీలో ప్రాథమిక పాఠశాల నిర్మించారని, అప్పటి నుంచి మెయిన్ రోడ్డు నుంచి పాఠశాలకు వెళ్లడానికి ఈ దారి ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. కానీ మంగళవారం ఒక వ్యక్తి వచ్చి ఈ స్థలం నాది అని, అందులో పాఠశాలకు అడ్డుగా గోడ నిర్మించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 ఏళ్ల నుంచి ఈ రోడ్డు వాడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు

● కలెక్టర్ సత్యప్రసాద్


మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలు తగ్గించడానికి వైద్యులు కృషి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు జరిగిన మరణాలలో 14 చిన్న పిల్లల మరణాలపై విద్యుత్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పిల్లల మరణాలు సంభవించకుండా తప్పించి మార్గాలను అన్వేషించాలని వైద్యులకు సూచించారు. వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని స్కానింగ్ సెంటర్లలో టిఫా స్కానింగ్, టూటీ ఏవో మొదలగునవి చేయించాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యుత్ అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొని మరణాల నివేదికను సమర్పించారు. ప్రతి కేసును క్షుణ్ణంగా వివరించి పలు సూచనలు చేశారు. ఎక్కువ ప్రీ టైమ్ బేబీస్ కంజెంటల్ హార్ట్ డిసీజెస్, అస్పిరేషన్ కేసులు ఉన్నాయి. ముఖ్యంగా నివారించతగిన మరణాలపై పలు సూచనలు చేశారు. తల్లులు తమ పిల్లలకు పాలు ఇచ్చిన తర్వాత భుజం మీద వేసుకుని బర్పీన్ చేయవలెనని, నెమ్మదిగా వెన్నుపై తట్టవలెనని, తేన్పులు వచ్చిన తర్వాతనే పడుకోబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎ.శ్రీనివాస్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్, డాక్టర్ పూర్ణచందర్, డాక్టర్ హరిత, శిశు సంక్షేమ శాఖ అధికారి భోనగిరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

బీర్‌పూర్,° ఎబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గుట్ట రాజారాజేశ్వర స్వామి ఆలయ సమీపంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ ఆలయంలో ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని నిర్వహించి సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నాదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, ఆయా గ్రామాల నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతదేహాల తరలింపులో వివక్ష

గొల్లపల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామ రెవెన్యూ శివారులో మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై శ్వేత, ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి నరేష్ దుర్మరణం చెందగా మృతదేహాల తరలింపులో వివక్ష చూపారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై శ్వేతను 108లో జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. నరేష్ మృతదేహాన్ని ట్రాలీ ఆటోలో తరలించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ స్వీతి అనూఫ్


కోరుట్లలో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న వైద్యులు

కోరుట్ల, ఫిబ్రవరి 04 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య అప్రమత్తతతో క్యాన్సర్ వ్యాధి నివారణ చేసుకోవచ్చునని డాక్టర్ స్వీతి అనూఫ్ రావు పేర్కొన్నారు. మంగళవారం క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వ్యాధి నివారణ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని కోరుట్ల నర్సింగ్ హోం నుంచి జాతీయ రహదారి మీదుగా కార్గిల్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా కేఎంజీఓస్ అధ్య క్షరాలు డాక్టర్ స్వీతి అనూఫ్ మాట్లాడారు. చక్కని ఆహారం, అలవాట్లు, వ్యాయమం, వ్యాకిన్స్, స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌ను నివారించవచ్చునని అన్నారు. ఈ ర్యాలీలలో వైద్యులు హెప్సిబా, జ్యోత్స్న, అనూఫ్‌రావు, రేగోండ రాజేష్, మనోజ్ కుమార్, జగదీశ్వర్, అన్వేష్, నరేష్, రవికిరణ్, అబ్రహ, ఇంద్ర నీల్, రమేష్, రాజేష్, శ్రీలత, అనూరాధ, శృతి, విజయశ్రీ, గీత, ప్రియాంక దీప్తి, మధుశ్రీ, హర్షిత, అనురాగ్ పాల్గొన్నారు.

మోరపల్లి అంగన్‌వాడీలో క్యాన్సర్ నివారణ దినం

జగిత్యాలరూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి అంగన్‌వాడీ కేంద్రం-2 లో మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ సంకోజి పద్మారాణి మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్, జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవద్దని, తమ బరువును నియంత్రణలో ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాయికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో మమత అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ మున్సిపల్ పరిధిలోని రాయికల్ 5వ అంగన్‌వాడీ సెంటర్, మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించకపోవడం, సరైన చికిత్స తీసుకోవడం వల్ల తీవ్రత పెరిగి మరణాల సంఖ్య భారీగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, ఏఎన్ఎం సరిత, ఆశ వర్కర్ జలజ, పాఠశాల ఉపాధ్యాయులు సిలివేరి రమేష్, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎన్.శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

శివ దీక్షలు ప్రారంభం

రాయికల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని శివాలయంలో మంగళవారం శివ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో 21 రోజులు అర్ధ మండల దీక్షలు స్వీకరించారు. భక్తులకు 41రోజుల భిక్ష, అల్పాహారం ఏర్పాటు చేయనున్నట్లు శివ స్వాముల అన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడు, కార్యదర్శులు చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీనర్సయ్యలు తెలిపారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ కోటా కింద రూ. 1.75 లక్షలు మంజూరు

కథలాపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 18 గ్రామాలకు 2024-25 సంవత్సరానికిగాను సీఆర్ఆర్ ఎస్సీ సబ్ ప్లాన్ కింద సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల కోసం రు.1.75 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం తెలిపారు. బొమ్మెన, దూలూరు, పెగ్గెర్ల, భూషణరావుపేటకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో మంజూరయ్యాయని తెలిపారు.

బడ్జెట్‌లో చరిత్ర సృష్టించిన నిర్మలాసీతారామన్

● పట్టణ మహిళామోర్చా అధ్యక్షురాలు మమత



మాట్లాడుతున్న పట్టణ మహిళామోర్చా నాయకురాలు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చరిత్ర సృష్టించారని బీజేపీ పట్టణ మోర్చా మహిళా అధ్యక్షురాలు దురిశెట్టి మమత అన్నారు. పట్టణంలోని కమల నిలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా వరుసగా 8సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టడం చరిత్రాత్మకం అన్నారు. గతంలో పనిచేసిన కేంద్ర మంత్రులు అంతకు మించిన సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వారికి వరుసగా అవకాశం లేకపోవడంతో ఆ ఘనత నిర్మలమ్మకే దక్కిందన్నారు. గతంలో పనిచేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రులకు భిన్నంగా పేపర్‌లెస్ విధానంలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ వస్తుడడం గమనించదగ్గ పరిణామం అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా మోదీ ఆలోచనకు అనుగుణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడమే కాకుండా, తన వస్త్రధారణతో ఏటా తెలుగు జాతి ఖ్యాతిని ఇనుమడింప జేస్తున్నారన్నారు.

వరుసగా బడ్జెట్ ప్రవేశపెడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న నిర్మలమ్మకు జగిత్యాల పట్టణ మహిళామోర్చ పక్షాన కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చ నాయకులు సింగం పద్మ, మేడిపెల్లి పుష్ప, చిన్నడి మధురిమ, పిండేరు భానుప్రియ, మామిడాల కవిత, కడార్ల లావణ్య తదితరులున్నారు.

ఘనంగా డోలోత్సవం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 04 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జోగినిపల్లి గ్రామంలోని వెంకటేశ్వర దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాయలంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన వేదపండితులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి డోలోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కోలాటాలను వేస్తూ సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలపై 13 న సమన్వయ సమావేశం

ధర్మపురి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో మార్చి 10 నుండి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాలు (జాతర)కోసం ఫిబ్రవరి 13న గురువారం సమన్వయ సమావేశం జరుగుతుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టీటీడీ ధర్మశాలలో 13 న గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తులకు వసతుల ఏర్పాట్లు గురించి చర్చించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి వివిధశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

శివ నామస్మరణతో మారుమ్రోగిన సోమేశ్వరకొండ

మల్లాపూర్, ఫిబ్రవరి, 4 (ఆంధ్రజ్యోతి) : రతసప్తమి సందర్భంగా మల్లాపూర్ మండల కేంద్ర శివారులోని శ్రీ కనుక సోమేశ్వరస్వామి ఆలయంలో శివ నామస్మరణతో మారుమొగింది. సోమవారం ఆలయం ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో మండలంలోని 60మంది భక్తులు శివదీక్షలు స్వీకరించారు. రతసప్తమి పురస్కరించుకుని మంగళవారం ఆలయంలోని స్వామి వారికి పురోహితులు పంచామృతలతో అభిషేకాలు చేపట్టినంతరం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, అర్చన కార్యక్రమాలను చేశారు. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి మండలంతో పాటు ఇతర మండలలోని భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. స్వామి వారికి రుద్రభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి తీర్థాప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, శివ దీక్షపరులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.